క్లుప్తంగా

మహిళల అక్రమ రవాణా నిరోధం మన బాధ్యత

పెరవలి: మహిళల అక్రమ రవాణాను అరికట్టడం అందరి బాధ్యతని, ఇందుకోసం ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు అంగన్‌వాడీ సిబ్బంది కృషి చేయాలని సీడీపీఓ డి.శ్రీలక్ష్మి అన్నారు. మహిళల అక్రమ రవాణా నిరోధంపై పెరవలి ఐసీడీఎస్ కార్యాలయంలో రెండు రోజులుగా అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం నాటి సదస్సులో శ్రీలక్ష్మి మాట్లాడుతూ మనుషుల రవాణా అతి పెద్ద నేరమన్నారు. డాక్టర్ సునీతా కృష్ణన్ ఏర్పాటు చేసిన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గత 28 ఏళ్లలో ఈ అక్రమ రవాణా నుంచి 28,200 మంది మహిళలను కాపాడారని తెలిపారు. మహిళల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పని చేస్తున్న ప్రజ్వల సంస్థ అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ శివకుమార్ మాట్లాడుతూ డబ్బు, సినిమా, ఉద్యోగావకాశాల ఆశ చూపి మహిళలను లైంగిక వ్యాపారంలోకి దించి, విదేశాలకు విక్రయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ఎం.భాగ్యలక్ష్మి, ప్రజ్వల, శివ, సుప్రియ, అనిల్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'మానవత' ఆర్థిక సాయం

నల్లజర్ల: పక్షవాతంతో మంచాన పడిన నల్లజర్లకు చెందిన షేక్ బేగం బీబీకి మానవత సంస్థ మండల శాఖ సభ్యులు గురువారం రూ.5,000 ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ మండలశాఖ అధ్యక్షులు ఝాన్సీ రాణి, మండల కన్వీనర్ గుళ్ళపూడి వెంకటరత్నం, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, కోశాధికారి ఐడీవీ అప్పారావు, డైరక్టర్ పాతూరి సత్యనారాయణ, పత్తిపాటి రాంబాబు పాల్గొన్నారు.

భవానీ మాలధారులకు భోజనం ఏర్పాట్లు

దేవరపల్లి: భవానీమాల ధరించి, విజయవాడ కనకదుర్గాదేవి దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన వెళుతున్న భక్తులకు దేవరపల్లి మండలం యర్నగూడెంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా భోజన ఏర్పాట్లు చేశారు. విశాఖ, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి నిత్యం వేలాది మంది భవానీలు కాలినడకన వెళుతున్నారు. మూడు రోజులుగా భవానీలకు పలువురు దాతలు భోజన సదుపాయం కల్పిస్తున్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు, మండల కమిటీ అధ్యక్షుడు కాట్నం గణేశ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు వర్దినీడి నరేంద్ర, కృష్ణంపాలెం సర్పంచ్ నాయుడు దుర్గాప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ పాలకవర్గం నియామకానికి చర్యలు



కొవ్వూరు రైతు బజార్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు: వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) పాలకవర్గాల నియామకానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు ఇచ్చారని, త్వరలోనే నూతన కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రకటించారు. ఆయన గురువారం నాయకులతో కలసి కొవ్వూరు ఏఎంసీ కార్యాలయాన్ని సందర్శించారు. ఏఎంసీకి సొంత కార్యాలయ భవనం నిర్మించలేదన్నారు. ఆదాయ వనరులు ఉన్నప్పటికీ ఏఎంసీ ద్వారా రైతులకు ఏవిధమైన సేవలూ అందించడం లేదన్నారు. రైతులకు అవసరమైన రైతుబజార్ల ఏర్పాటు, గోదాముల నిర్మాణం, పుంత రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంతమణి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, పెనుమాక జయరాజు తదితరులు పాల్గొన్నారు.అనంతరం రైతు బజార్‌ను ఎమ్మెల్యే పరిశీలించి దుకాణదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

బాలదుర్గమ్మ గుడికి రూ.50 వేల విరాళం



అమ్మవారికి రూ. 50 వేలు విరాళంగా అందజేస్తున్న మాధవరపు వెంకటేశ్వరరావు

దేవరపల్లి: స్థానిక బాలదుర్గమ్మ వారి ఆలయానికి గ్రామానికి చెందిన మాధవరపు సూర్యచంద్రం, అనంతలక్ష్మి దంపతుల కుమారుడు, యువ పారిశ్రామికవేత్త మాధవరపు వెంకటేశ్వరరావు గురువారం రాత్రి రూ. 50 వేలు విరాళంగా అందజేశారు. విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణకు అందజేశారు.

నంగాలమ్మ వారికి చైర్మన్ పూజలు

నిడదవోలు: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక నంగాలమ్మ వారిని బుధవారం రాత్రి మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చైర్మన్ ఆదినారాయణ పుస్తకాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదినారాయణను సత్కరించి అమ్మవారి జ్ఞాపిక అందించారు.

పదును కోసం ఎదురుచూపు

- దుక్కులు చేసి సాళ్లు సిద్ధం చేసిన రైతులు
- వర్షాలతో వర్జీనియా పొగాకు నాట్లకు అనుకూలించని వాతావరణం
- నారుమళ్ల సంరక్షణలో రైతులు



రైతు సంరక్షణలో వర్జీనియా నారుమడులు

నల్లజర్ల: వర్జీనియా పొగాకు నాట్లు వేసేందుకు భూమిలో పదును కుదరడం లేదు. రైతులు పొలాల్లో దుక్కులు దున్ని సాళ్లు సిద్ధం చేసుకున్న తరుణంలో వర్షం పడుతోంది. పొలం అదునుగా లేకపోవడంతో నాట్లు వేయడానికి తరచూ అంతరాయం కలుగుతోందని వర్జీనియా పొగాకు సాగు చేస్తున్న రైతులు వాపోతున్నారు. ఆగస్టులో వేసిన పొగాకు నారుమళ్లు ఇప్పటికే తయారయ్యాయి. అక్టోబర్ మొదటి వారం నుంచే మండలంలోని పోతవరం పరిసర ప్రాంతాల్లో పొగాకు నాట్లు వేయాలి. ఇంచుమించు రోజూ పడుతున్న వర్షాల వల్ల నాట్లు వేయడానికి అంతరాయం కలుగుతోంది. దీపావళికి గాని నవంబర్ మొదటి వారంలో గాని నాట్లు వేయడానికి రైతులంతా సమాయత్తం అవుతున్నారు. తీరా నాట్లు వేశాక తుపాన్లు, అధిక వర్షాలు వస్తే లేత తోటలు దెబ్బతినే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే ఆలస్యమైంది. దీపావళి, నవంబర్ మొదటి వారం తర్వాతైనా వాతావరణం అనుకూలిస్తే నాట్లు వేసే కార్యక్రమం జరుగుతుంది. వేసిన నాట్లు ఒక వేళ నవంబర్‌లో వచ్చే తుపానుల తాకిడికి పాడైతే తమ పరిస్థితి ఏమిటని రైతులు సందిగ్ధంలో పడుతున్నారు. పాడైన తోటలు తీసేసి మళ్లీ కొత్త తోటలు వేయడానికి అప్పుడు వర్జీనియా పొగాకు నారు దొరకడం కూడా కష్టం అవుతుందంటున్నారు. ఇంకొందరు రైతులైతే.. అయిన ఆలస్యం ఎలానూ అయ్యింది. ఈ తుపానుల గొడవ పూర్తయ్యాకే తోటలు వేద్దామన్న ఆలోచనలో ఉన్నారు. ఇప్పటికే నారుమళ్లు తయారయ్యాయి. చీడపీడలు సోకకుండా నిత్యం నారుమళ్ల వద్దే రైతులు అప్రమత్తంగా ఉంటున్నారు.

ఒక బ్యారన్ లైసెన్స్‌కు 33 క్వింటాళ్లు

మండలంలోని పోతవరం పరిసర గ్రామాల్లో ఒక బ్యారన్ లైసెన్స్‌కు ఈ ఏడాది 33 క్వింటాళ్ల పొగాకు పండించడానికి బోర్డు అనుమతించింది. 600 బ్యారన్ల పరిధిలో 1,800 ఎకరాల విస్తీర్ణంలో వర్జీనియా పొగాకు సాగవుతోంది. రైతులంతా ఏటా ఎల్‌వీ- 7 రకం విత్తనాన్నే ఎక్కువగా సాగు చేసేవారు. ఈ ఏడాది మాత్రం ఎ-3 అనే కొత్త వంగడాన్ని ఎంపిక చేసుకొని నారుమడులు కట్టారు. పాతరకం ఎకరానికి 12 క్వింటాళ్ల వరకూ దిగుబడి వచ్చేది. కొత్తరకం వంగడం అక్టోబర్‌లో నాట్లు పడితే ఆశించిన దిగుబడులు వచ్చేవి. ఈ ఏడాది నాట్లు ఆలస్యం అవుతున్నందున దిగుబడులు అంతంత మాత్రంగానే ఉండవచ్చునని రైతులు భావిస్తున్నారు.

ఈ ఏడాది నాట్లు వేయడం ఆలస్యమైంది. ఈ నెలాఖరు నుంచి నాట్లు ప్రారంభిస్తాం. నాట్లు త్వరిగతిన పూర్తవ్వాలంటే గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడ వ్యవసాయ అవసరాలకు విద్యుత్‌ను ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అందివ్వాలని రైతులు కోరుతున్నారు. ఈ నెలలోనే నాట్లు వేయడానికి సన్నాహాలు చేశాం. దుక్కులు కూడా పూర్తి చేశాం. వర్షాలు రావడంతో దుక్కులు పదును పోయాయి. మరోపక్క నారుమళ్లకు తెగుళ్ల సోకుతున్నాయి. నారు దెబ్బతింటే గతేడాది ఎకరానికి రూ.18 ఖర్చు చేసి రెండోసారి తెచ్చాం. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి వస్తుందా? అని రైతులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం పోతినీడుపాలెం పరిసర ప్రాంతంలో ఒకరిద్దరు నాట్లు ప్రారంభించారు.

ఈ నెలాఖరు వరకూ ఆగాల్సిందే



"ఈ నెలలో మూడు తుపాన్లు ఉన్నాయని చెబుతున్నారు.ఈ కారణంగా వర్జీనియా పొగాకు నాట్లు వేయడానికి అదును, పదును ఉండాలంటే దీపావళి వరకూ ఆగాలి. గతేడాది పొగాకు సాగు ఊహించని లాభాలు తెచ్చి పెట్టింది. దీంతో మిరప వంటి పంటలను తగ్గించి అత్యధికంగా రైతులు ఈ సాగుపైనే దృష్టి పెట్టారు. సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. భూమి కౌలు ధరలు కూడా అమాంతం పెరిగాయి. ఈఏడాది సీజన్ ప్రారంభం నుంచే అడపాదడపా వర్షాలు పడటంతో చేసిన దుక్కులు పాడయ్యాయి. మళ్లీ భూమి పదును రావాలి.అంతే కాకుండా రైతులంతా ఒకే సారి పనులు ప్రారంభిస్తే కూలీల కొరతతో పాటు కూలీల రేట్లు తీవ్రంగా ఉండే పరిస్థితి కనపడుతోంది."

దూలపల్లి ప్రసాద్, వర్జీనియా రైతు, పోతవరం, నల్లజర్ల మండలం

మానసిక వికలాంగులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



మానసిక వికలాంగుల కేంద్రంలో మాట్లాడుతున్న న్యాయవాది వెంకటేశ్వర్లు

ఉండ్రాజవరం: మానసిక వికలాంగుల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని న్యాయవాది కౌరు వెంకటేశ్వర్లు అన్నారు. నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాల మేరకు పాలంగి గ్రామంలోని స్పందన మానసిక వికలాంగుల కేంద్రాన్ని గురువారం తణుకు ప్యానల్ న్యాయవాది ఎ.అజయ్‌కుమార్‌తో కలసి వెంకటేశ్వర్లు సందర్శించారు. టీచింగ్ స్టాఫ్‌కు, మేనేజ్‌మెంట్‌కు వికలాంగ బాలలకు గల హక్కుల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత ఉండి కూడా ఎవరికైనా పింఛన్ రాకపోతే మండల న్యాయ సేవల కమిటీని సంప్రదిస్తే అధికారులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి పెన్షన్ మంజూరు చేయిస్తారన్నారు. కార్యక్రమంలో స్పందన కేంద్రం ఇన్‌చార్జ్ సుసారిత, పారా లీగల్ వలంటీర్లు దులపల్లి బ్రహ్మజీ, కె.నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలన్నీ మనవే..



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వనిత



హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులు

- కూటమి ప్రభుత్వం తరఫున ఎమ్మెల్యే ఒక్కరే..
- పార్టీ శ్రేణులు భయపడాల్సిన పని లేదు
- వైఎస్సార్ సీపీ సమావేశంలో మాజీ మంత్రి తానేటి వనిత

గోపాలపురం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఆ పార్టీ నాయకులు అండగా ఉండాలని రాష్ట్ర మాజీ మంత్రి తానేటి వనిత అన్నారు. గోపాలపురంలోని కూసం రామమోహన్‌రెడ్డి నివాసం వద్ద గురువారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు పెరిగి పోయాయన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసుల బనాయించడమే లక్ష్యంగా పని చేయడం సిగ్గు చేటన్నారు. నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వానికి ఒక్క ఎమ్మెల్యే మాత్రమే ఉన్నారని గుర్తు చేశారు. కానీ నాలుగు మండలాల్లోనూ వార్డు సభ్యుల దగ్గర నుంచి ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుల వరకూ వైఎస్సార్ సీపీ క్యాడరే ఉన్నందున పార్టీ శ్రేణులెవరూ భయపడాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ ప్రజలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని వనిత అన్నారు. ఏసమస్య వచ్చినా తనకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు పోతిరెడ్డి నాగరాజు, నాయకులు ఇళ్ళ భాస్కరరావు, వింత ప్రసాద్ రెడ్డి, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, ఎస్‌కే వల్లీ, పీతల ప్రసాద్‌బాబు, మండలంలోని వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

14 మద్యం షాపులకు 614 దరఖాస్తులు

- దేవరపల్లి సర్కిల్ పరిధిలో రూ.12.84 కోట్ల ఆదాయం
- ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు



బళ్ల శ్రీనివాసరావు, సీఐ, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ, దేవరపల్లి

దేవరపల్లి: దేవరపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మూడు మండలాల్లో 14 మద్యం షాపుల కోసం గురువారం నాటికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో 614 దరఖాస్తులు వచ్చినట్టు సీఐ బళ్ల శ్రీనివాసరావు తెలిపారు. స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకూ స్టేషన్ ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తుల ఫీజు రూపంలో రూ.12.84 కోట్ల ఆదాయం వచ్చినట్టు చెప్పారు. దేవరపల్లి మండలంలో 5, గోపాలపురం మండలంలో మూడు, నల్లజర్ల మండలంలో 6 బ్రాందీ షాపులు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. ఈ నెల 11వ తేదీ రాత్రి 7 గంటల వరకూ దరఖాస్తుల స్వీకరణ జరుగుతున్నందున, దరఖాస్తుల సంఖ్య 700 వరకూ పెరగవచ్చని భావిస్తున్నామన్నారు. ఈ నెల 14న రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మద్యం షాపులకు లాటరీ తీస్తారని చెప్పారు. జిల్లాలోని ఏడు సర్కిల్ కార్యాలయాల పరిధిలోని మద్యం షాపులకు అక్కడే లాటరీ తీస్తారని ఆయన చెప్పారు.

మండలం యూనిట్‌గా మద్యం షాపుల ఏర్పాటు

లాటరీలో షాపులు పొందిన వారికి 15వ తేదీన డీపీఈఓ ప్రొహిబిషన్ లైసెన్సులు జారీ చేస్తారని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. 16 ఉదయం డిపోలకు వెళ్లి సరకు స్టాకు తీసుకోవాలన్నారు. బ్రాండెడ్ మద్యం సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. ఒకొక్క షాపునకు లైసెన్స్ ఫీజుగా రూ.65 లక్షలు చెల్లించాలన్నారు. లైసెన్స్ కాలపరిమితి 2026 వరకూ ఉంటుందని, ప్రతి రెండు నెలలకు ఒకసారి వాయిదాల రూపంలో ఫీజు చెల్లించాలన్నారు. ముందుగా రూ.10.84 లక్షలు ఫీజు చెల్లించి లైసెన్సు పొందాలని తెలిపారు. రెండో ఏడాది ఫీజు 10 శాతం పెరుగుతుందన్నారు. దీని ప్రకారం రూ.71.50 లక్షలు చెల్లించవలసి ఉంటుందన్నారు.

16 నుంచి కొత్త మద్యం షాపులు

లైసెన్సు పొందిన దరఖాస్తుదారులు ఈ నెల 16వ తేదీ ఉదయం కొత్త షాపులు ఏర్పాటు చేసుకోవలసి ఉందన్నారు. 15వ తేదీ రాత్రి 9 గంటలతో పాత మద్యం పాలసీ రద్దవుతుందని తెలిపారు. దేవరపల్లి, గోపాలపురం మండలాలకు చాగల్లు డిపో, నల్లజర్ల మండలానికి తాడేపల్లిగూడెం డిపో కేటాయించామన్నారు. సారా విక్రయాలను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని, గీత కార్మికులకు, సారా, బెల్లం వ్యాపారులకు త్వరలో అవగాహన సదస్సులు నిర్వహించి, ప్రత్యామ్నాయ వ్యాపారాలకు ప్రోత్సహిస్తామని తెలిపారు. బ్రాందీ షాపు వద్ద విధిగా పర్మిట్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండలంలో ఏ గ్రామంలో నైనా షాపు పెట్టవచ్చునని ఆయన చెప్పారు.

నిడదవోలు నియోజకవర్గంలో 758..

నిడదవోలు: నియోజకవర్గంలోని 19 మద్యం షాపుల లైసెన్సుల కోసం ఇప్పటి వరకూ 758 దరఖాస్తులు వచ్చాయి. నిడదవోలు టౌన్‌లో 162 మంది దరఖాస్తు చేసుకున్నారు. నిడదవోలు మండలం నుంచి 179, ఉండ్రాజవరం మండలం నుంచి 180, పెరవలి మండలం నుంచి 237 దరఖాస్తులు వచ్చాయి. చివరి రోజు శుక్రవారం దరఖాస్తులు పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

నిడదవోలు రూరల్: గ్రామాల అభివృద్ధికి ఉప సర్పంచులు, వార్డు సభ్యులు సమన్వయంతో పని చేయాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ట్రెనింగ్ మేనేజర్ గుర్రాల ప్రసంగిరాజు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ పాలక వర్గాల సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. మాస్టర్ ట్రెనీలు కె.శ్రీనివాసరావు, మొహిద్దీన్‌లు పంచాయతీల విధులు, బాధ్యతలు, పారిశుధ్యం, వీధిదీపాల నిర్వహణ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నాగ్‌నాథ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమన్వయంతో పంచాయతీల అభివృద్ధి

ఉండ్రాజవరం: సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు సమన్వయంతో పనిచేసి పంచాయతీలను అభివృద్ధి పథంలో నిలపాలని ఎంపీడీవో వి.రామారావు సూచించా. ఉప సర్పంచులు, ఎంపిక చేసిన వార్డు సభ్యుల రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ముగిసింది. ఈవోపీఆర్డీ శర్మ పంచాయతీ పాలన, పారిశుధ్యం, ఆర్థిక అంశాల నిర్వహణపై శిక్షణ నిచ్చారు. అయితే ఈ శిక్షణ కార్యక్రమాలకు మండలంలోని అధిక శాతం ప్రజా ప్రతినిధులు హాజరు కాలేదు.

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..

దేవరపల్లి: తెలంగాణ పండుగల్లో ప్రధానమైన బతుకమ్మ సంబురాలను గురువారం రాత్రి దేవరపల్లిలోని మూడుబొమ్మల సెంటర్లోని సౌభాగ్య దుర్గాంబికా దేవి ఆలయం వద్ద వేడుకగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ సంబురాలు ఏర్పాటు చేశారు. మహిళలు తమ ఇళ్ల వద్ద రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి అమ్మవారి ఆలయం వద్దకు తీసుకు వచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం వారంతా బతుకమ్మ..బతుకమ్మ.. ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ అమ్మవారిని కొలిచారు. తర్వాత బతుకమ్మలను గ్రామంలో ఊరేగించి జలపాతంలో నిమజ్జనం చేశారు. సుమారు 10 సంవత్సరాల నుంచి దసరా ఉత్సవాల్లో భాగంగా బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ వారు తెలిపారు.



దేవరపల్లి మూడు బొమ్మల సెంటర్లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

దుర్గమ్మా.. కరుణించమ్మా

- దుర్గాష్టమి కావడంతో మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- కోటసత్తెమ్మ వారికి ప్రత్యేక పుష్పాలంకరణ



తిమ్మరాజుపాలెంలోని కోట సత్తెమ్మ ఆలయం వద్ద సహస్ర నామ కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

నిడదవోలు రూరల్: దేవీ శరన్నవరాత్ర సంబరాలను ఊరువాడా భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మండలంలోని తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ వారిని 8వ రోజు దుర్గాష్టమి కావడంతో గురువారం భారీగా భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి 332 మంది దంపతులు సహస్ర నామ కుంకుమ పూజలతో పాటు చండీ పారాయణం, హోమాలు నిర్వహించారు. అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.1,85,004 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాశ్ చెప్పారు. భారీగా తరలి వచ్చిన భక్తులు అన్నసమారాధనలో అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రధానార్చకుడు ఎస్‌వీకేఏ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. గోపవరం గుబ్బల మంగమ్మ, సమిశ్రగూడెంలో పుంతలో ముసలమ్మ, డి.ముప్పవరంలో కొండాలమ్మ, ముత్యాలమ్మ, లోహియానగర్‌లో కనకదుర్గమ్మ, కంసాలిపాలెంలో దేవీపాటెమ్మ అమ్మవార్లను, దుర్గాదేవీ విగ్రహాలను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష కుంకుమ పూజలు జరిపించారు.

దేవరపల్లి: దుర్గాష్టమి సందర్భంగా జగత్ జనని జగన్మాత అమ్మవారిని గురువారం దుర్గాదేవిగా అలంకరించి, భక్తులు పూజలు చేశారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ మహిళలు కుంకుమార్చన చేశారు. స్థానిక మూడు బొమ్మల సెంటర్లోని సౌభాగ్య దుర్గాంబికా దేవిని, బాలదుర్గమ్మ వారిని దుర్గాదేవిగా అలంకరించి, పూజలు నిర్వహించారు. స్థానిక పల్లపు వీధి రామాలయం వద్ద గల దుర్గాదేవి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు.

గోపాలపురం: స్థానిక గుడ్డిగూడెం రోడ్డులోని యర్రంపల్లమ్మ తల్లిని శాకంబరీ అమ్మవారిగా అలకంరించి పూజలు చేశారు. లలితాంబిక అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు, లలితా సహస్ర నామాలు పఠించారు.

తాళ్లపూడి: స్థానిక నవ దుర్గాధి పరివార శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ గుడిలోని అమ్మవారికి కనక దుర్గాదేవిగా అలంకరించారు. అర్చకుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని మలకపల్లి, వేగేశ్వరపురంలోని మేదర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోని ఆలయంలోను విశేష పూజలు జరిగాయి. బల్లిపాడు శివాలయంలోను, గజ్జరం, అన్నదేవరపేట, పైడిమెట్ట, పెద్దేవం, తాడిపూడి తదితర గ్రామాల్లో భవానీ మాలధారులు అమ్మవార్ల ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

చాగల్లు: దుర్గాష్టమి సందర్భంగా స్థానిక మాతంగి చెరువు గట్టుపై గల కనకదుర్గమ్మను గురువారం దుర్గాదేవిగా అలంకరించారు. భక్తులు కుంకుమ పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం వద్ద రాత్రి ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మహాలక్ష్మమ్మ ఆలయంలో కూడా మహిళలు కుంకుమ పూజలు చేశారు. ధనలక్ష్మి అమ్మవారిని తామర పుష్పాలతో అలంకరించారు. మీనానగరం గ్రామంలోని ముత్యాలదిబ్బ వద్ద గల అమ్మవారికి భవానీలు, మహిళలు పూజలు నిర్వహించారు. బ్రాహ్మణగూడెంలో గ్రామదేవత నాగారమ్మ ఆలయంలో భజన చేశారు. అలాగే రావులచెరువు గట్టుపై గల కనకదుర్గమ్మకు విశేష పూజలు నిర్వహించారు.



దుర్గాదేవి అలంకరణలో దేవరపల్లి సౌభాగ్య దుర్గాంబికాదేవి



గోపాలపురంలో..



తాళ్లపూడిలో..



దుర్గామాత అలంకారంలో బ్రాహ్మణగూడెం నాగారమ్మ

అయ్యప్ప స్వాములకు తాళ్లపూడిలో పీఠం



తాళ్లపూడిలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప పీఠం వద్ద పూజలు చేస్తున్న అయ్యప్ప మాలధారులు

తాళ్లపూడి: స్థానిక అయ్యప్ప, సాయిబాబా ఆలయాల వెనుక గల ఆర్యవైశ్య సత్రంలో శ్రీధర్మశాస్త అయ్యప్ప పీఠాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఇక్కడ శాస్త్రోక్తంగా పూజలు కూడా ప్రారంభించారు. సుమారు 150 మంది భక్తులు దీక్ష చేపట్టి, 41 రోజుల పాటు నిత్యం పూజలు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేశారు. పలువురు భక్తులు గురువారం మాలధారణ చేశారు. వారంతా శబరిమల యాత్రకు బయలు దేరి వెళ్లే నవంబర్ 20 వరకూ ఈ పీఠంలోనే నిత్య పూజలు జరుపుకోవచ్చు. స్వాములకు ఉదయం 7 నుంచి 9 గంటల వరకూ వడి, మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకూ భిక్ష, రాత్రి 8 నుంచి 9 గంటల వరకూ వడి, భోజన వసతి ఏర్పాట్లు చేశారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా నందిని బేకరీ ప్రసాద్, చిన్నా మిత్ర బృందం ఆధ్వర్యంలో ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. రూ. లక్షల వ్యయంతో 41 రోజుల దీక్షలో స్వాములకు అన్ని వసతులూ ఉచితంగా కల్పిస్తున్నట్టు ప్రసాద్, మిత్ర బృందం తెలిపారు.